## ఇక బడుగు వ్యాపారుల పైనా జీఎస్టీ!

న్యూఢిల్లీ, మే 24: మధ్య స్థాయి నుంచి భారీ స్థాయిలో వ్యాపారం చేసే వారిని లక్ష్యంగా చేసుకుని ఎడాపెడా జీఎస్టీ భారాన్ని విధించిన కేంద్రం ఇప్పుడు బడుగు, బలహీన వర్గాలను కూడా పన్ను పరిధిలోకి తేవాలని తహతహలాడుతున్నది. అనధికారిక ఆర్థిక కార్యకలాపాలను నియంత్రించి వారిని కూడా జీఎస్టీ పరిధిలోకి తెచ్చేందుకు కేంద్రం జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించనుంది. ఈ మేరకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) తన ఫీల్డ్ అధికారుల ద్వారా ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు కసరత్తులు ప్రారంభించింది. నమోదు కాని సంస్థల ద్వారా పన్ను ఎగవేతలను నిరోధించి నగదు ఆధారిత, లెక్కల్లో చూపని లావాదేవీలపై ఆధారపడటాన్ని తగ్గించాలని ధ్యేయంగా నిర్ణయించుకుంది. ఇదే కనుక అమలైతే ఇక నుంచి బజ్జీల బండి వాళ్లు, బండ్లపై అరటి పండ్లు అమ్ముకునే వారితో పాటు రోడ్డు పక్కన ఉండే మెకానిక్‌లు, సైకిల్ షాపు వాళ్లు, టైర్లకు గాలి కొట్టేవారు.. ఇలా ఒకరేమిటి రోడ్డుపక్కన తోటకూర అమ్ముకునే తాత నుంచి, రేగు పండ్లు అమ్ముకునే మామ్మ వరకు అందరిపై జీఎస్టీని ఎడాపెడా విధించడానికి కేంద్రం చకచకా పావులు కదుపుతున్నది.

## డీ-మెర్జింగ్‌తో వాటాదారులకు లాభమే

టాటా మోటర్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్



నూఢిల్లీ, మే 24: టాటా మోటర్స్‌ను విడగొట్టే ప్రతిపాదనతో దీర్ఘకాలికంగా వాటాదారులకు లాభం చేకూరనున్నదని కంపెనీ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. కంపెనీ 80వ వాటాదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టాటా మోటర్స్‌ను రెండు సంస్థలుగా విడగొట్టి కమర్షియల్ వాహనాలు, ప్యాసింజర్ వాహన విభాగాలుగా విడగొట్టి స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలనుకుంటున్నట్టు చెప్పారు. ఈ ప్రతిపాదనకు ఇప్పటికే వాటాదారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఈ ఏడాది రెండో అర్థ భాగం నాటికి టాటా మోటర్స్ రెండు సంస్థలుగా మారబోతున్నది. వ్యాపార వ్యూహాత్మకంలో భాగంగా పలు సంస్థలను విడగొట్టాలని నిర్ణయించినట్టు, దీంతో గ్రూపు ఆర్థికంగా బలోపేతం కావడంతోపాటు వాటాదారులకు లబ్ధిచేకూరనున్నదని ఆయన వ్యాఖ్యానించారు.




# గిన్నిస్‌బుక్‌లో ఎల్ఐసీ

### 24 గంటల్లో 5.88 లక్షల పాలసీల విక్రయంతో రికార్డు

న్యూఢిల్లీ, మే 24: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ మరో అరుదైన ఘనతను సాధించింది. కేవలం 24 గంటల్లో రికార్డు స్థాయిలో బీమా పాలసీలను విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నది. ఈ ఏడాది జనవరి 20న ఈ అరుదైన ఘనతను సాధించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. విస్తృతమైన ఏజెన్సీ నెట్‌వర్క్ కలిగిన తమ పనితీరుకు గుర్తుగా గిన్నిస్ వరల్డ్ రికార్డు గుర్తించిందని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 20న కంపెనీకి చెందిన 4,52,839 ఏజెంట్లు ఒక్కో పాలసీ చొప్పున 5,88,107 జీవిత బీమా పాలసీలను విక్రయించారు. బీమా చరిత్రలో 24 గంటల వ్యవధిలో ఈ స్థాయిలో పాలసీలను విక్రయించడం ఇదే తొలిసారని తెలిపింది. ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవం రోజైన జనవరి 20న 'మ్యాడ్ మిలియన్ డే'ను పురస్కరించుకొని ఒక్కో ఏజెంట్ కనీసం ఒక్కో పాలసీ అయిన పూర్తి చేయాలన్న కంపెనీ ఎండీ, సీఈవో సిద్దార్థ మొహంతీ విజ్ఞప్తి మేరకు ఈ అరుదైన ఫీట్‌ను సాధించినట్లు వెల్లడించారు. ఈ అరుదైన మైలురాయిని సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు.




# సింగిల్ చార్జింగ్‌తో 835 కిలోమీటర్లు

### ఈవీను విడుదల చేసిన చైనా సంస్థ షియోమీ

న్యూఢిల్లీ, మే 24: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ షియోమీ మరో అడుగుముందుకేసింది. ఇప్పటికే తన తొలి మాడల్‌కు విశేష స్పందన లభిస్తున్న ప్రస్తుత తరుణంలో మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వైయూ7 పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో గరిష్ఠంగా 835 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. టెస్లాకు చెందిన వై మాడల్‌కు పోటీగా ఈ కారును ప్రవేశపెట్టింది. ఇప్పటికే విడుదల చేసిన ఎస్‌యూ7 సెడాన్ 2.58 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి.

**ఈ నూతన కారు ప్రత్యేకతలు..**

- సింగిల్ చార్జింగ్‌తో 835 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. అత్యధిక మైలేజీ ఇచ్చే మూడో మాడల్ ఇదే కావడం విశేషం.
- 96.3 కిలోవాట్ల ఎల్ఎఫ్‌పీ బ్యాటరీతో తీర్చిదిద్దింది. కేవలం 3.23 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ మాడల్ గంటకు 253 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.
- ప్రో మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 770 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

# ఎఫ్‌డీఐలు తిరోగమనం

### 2024-25లో భారీగా తగ్గిన విదేశీ పెట్టుబడులు



న్యూఢిల్లీ, మే 24: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో నరేంద్ర మోదీ సర్కార్ విఫలమవుతున్నది. గడిచిన కొన్నేండ్లుగా తగ్గుముఖం పట్టిన ఎఫ్‌డీఐలు..గడిచిన ఆర్థిక సంవత్సరంలోనూ భారీగా పడిపోయాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లోకి కేవలం 353 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం ఏడాది వచ్చిన 10 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలతో పోలిస్తే 96.5 శాతం తగ్గాయని పేర్కొంది. అంతక్రితం ఏడాది రికార్డు స్థాయి ఎఫ్‌డీఐలను ఆకర్షించిన భారత్.. ఆ మరుసటి ఏడాదే భారీగా పడిపోవడం విశేషం. కానీ, విదేశాల్లో పెట్టుబడులు పెట్టే దేశీయ కంపెనీలు భారీగా పెరుగుతున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆయా సంస్థలు 29 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టాయి. అంతక్రితం ఏడాది పెట్టిన 17 బిలియన్ డాలర్ల కంటే ఇది 50 శాతానికి పైగా అధికం.

**విదేశీ పెట్టుబడిదారులు దూరం**

ప్రపంచ దేశాల్లో భారత్ అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నప్పటికీ విదేశీ పెట్టుబడిదారులు పెద్దగా ఆసక్తిని కనబర్చడం లేదు. దీంతో గడిచిన కొన్నేండ్లుగా భారీగా పెట్టుబడులు పెట్టిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు..గతేడాది పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజవేశారు. కానీ, దేశీయ ఈక్విటీ మార్కెట్లపై మాత్రం ఎనలేని ప్రేమను కురిపిస్తున్నారు. ఇతర దేశాల ఈక్విటీ మార్కెట్లతో పోలిస్తే సెన్సెక్స్, నిఫ్టీలు రెండంకెల స్థాయిలో రాబడిని పంచడమే ఇందుకు కారణం. మొత్తంగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌డీఐలు 13.7 శాతం పెరిగి 81 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వీటిలో సగం ఐపీవోకి వచ్చిన సంస్థల్లో ఇన్వెస్ట్ చేశారు. 2023-24 సంవత్సరంలో విదేశీ పెట్టుబడిదారులు 49 బిలియన్ డాలర్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, ఆల్ఫా వేవ్ గ్లోబల్ అండ్ పార్టనర్స్ గ్రూపు, స్విగ్గీ, విశాల్ మెగా మార్ట్‌లోకి వచ్చిన ఎఫ్‌డీఐలు అత్యధికంగా వచ్చాయి. అలాగే అల్టార్‌నెటివ్ క్యాపిటల్ అసోసియేషన్(ఐవీసీఏ), ఈవై, పీఈ/వీసీ ల నుంచి 26.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. హ్యుందాయ్ మోటర్ ఇండియా తన వాటాను 100 శాతం నుంచి 82.5 శాతానికి తగ్గించుకోవడంతో రూ.27,870 కోట్ల నిధులు సమకూరగా, అలాగే స్విగ్గీ కూడా 2 బిలియన్ డాలర్ల నిధులను సేకరించింది. వీటితోపాటు టెలికం దిగ్గజం సింగ్‌టెల్..భారతీ ఎయిర్‌టెల్‌లో తనకున్న వాటాను మొత్తం విక్రయించగా, అలాగే బ్రిటిష్ అమెరికన్ టొబాకో(బీఏటీ)..ఐటీసీలో ఉన్న తన మొత్తం వాటాను విక్రయించింది. గతేడాది సెప్టెంబర్ నెలలో దేశీయ ఈక్విటీ మార్కెట్లు రాకెట్ వేగంతో దూసుకుపోవడంతో ఒక్కో విదేశీ కంపెనీలు..దేశీయ పెట్టుబడులను ఉపసంహరించుకున్నాయి.

### తయారీ రంగానికి బ్రేక్‌లు

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో తయారీ రంగంతోపాటు ఆర్థిక సేవలు, ఎనర్జీ, కమ్యూనికేషన్ రంగాలు విఫలమయ్యాయి. గత కొన్నేండ్లుగా ఈ రంగాలు ఆశాజనక పనితీరు కనబర్చలేకపోవడంతో విదేశీ పెట్టుబడిదారులు వీటివైపు కన్నెత్తి కూడా చూడలేదు. తయారీ, ఆర్థిక సేవలు, ఎనర్జీ, టెలికం రంగాల్లోకి ఎఫ్‌డీఐలు భారీగా తగ్గడం మొత్తం ఎఫ్‌డీఐలపై ప్రతికూల ప్రభావం చూపాయని సెంట్రల్ బ్యాంక్ తాజా నివేదికలో వెల్లడించింది.

## హైదరాబాద్‌లో యంత్రాల ఎగ్జిబిషన్

హైదరాబాద్, మే 24: దక్షిణాదిలో అతిపెద్ద బీ2బీ ఇండస్ట్రియల్ యంత్రాలు అండ్ ఇంజినీరింగ్ ఎగ్జిబిషన్‌కు మరోసారి హైదరాబాద్ వేదికైంది. నాలుగోసారి జరుగుతున్న ఈ ఎగ్జిబిషన్‌లో ఇంజినీరింగ్, మౌలిక రంగానికి సంబంధించిన అన్ని రకాల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. మెషిన్ టూల్స్, ఆటోమేషన్, రోబోటిక్స్, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, ఇంజినీరింగ్ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు.

**బ్రోక్‌ఫిల్డ్ భారీ పెట్టుబడులు**

న్యూఢిల్లీ, మే 24: అంతర్జాతీయ పెట్టుబడుల సంస్థ బ్రోక్‌ఫిల్డ్..భారత్‌లో భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. వచ్చే ఐదేండ్లకాలంలో తన ఆస్తులను 100 బిలియన్ డాలర్ల స్థాయిలో పెంచుకోవడానికి భారీగా ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నది. ప్రస్తుతం సంస్థ భారత్‌లో 30 బిలియన్ డాలర్ల విలువైన ఆస్తులు కలిగివున్నది. మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్, రెన్యూవబుల్ ఎనర్జీ, ప్రైవేట్ ఈక్విటీల్లో తన అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ కలిగివున్నది.

# ఎఫ్ఐఐల 5 వేల కోట్లు వెనక్కి

### గతవారంలో తరలించుకుపోయిన విదేశీ ఇన్వెస్టర్లు

న్యూఢిల్లీ, మే 24: దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీ స్థాయిలో నిధులను వెనక్కితీసుకుంటున్నారు. ఇదే క్రమంలో ప్రస్తుత వారంలోనూ రూ.5 వేల కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడంతో ఈ నెల 19 నుంచి 23 మధ్యకాలంలో ఈక్విటీల నుంచి రూ.4,784.32 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎఫ్ఐఐల పెట్టుబడులు రూ.18,620 కోట్ల నుంచి రూ.13,835 కోట్లకు తగ్గాయని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఐదు సెషన్లలో విదేశీ పెట్టుబడిదారులు అత్యధికంగా తమ పెట్టుబడులను తరలించుకుపోయారు. తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు గతవారంలో ఒకేరోజు 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను వెనక్కితీసుకున్నారు. అయినప్పటికీ ప్రస్తుత సంవత్సరంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి ఎఫ్ఐఐలు రూ.98,516 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..యూరోపియన్ దేశాలపై ప్రతీకార సుంకాలను 50 శాతం విధిస్తూ తీసుకున్న నిర్ణయం అంతర్జాతీయంగా పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా ఈక్విటీల నుంచి తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించారు. దేశీయ ఆర్థిక మూలాలపై ఎలాంటి ప్రభావం లేదని, కేవలం అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల వల్లనే ఎఫ్ఐఐలు వెనక్కి తీసుకుంటున్నారని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ నెలలో ఎఫ్ఐఐలు రూ.4,223 కోట్ల పెట్టుబడులు పెట్టగా, మార్చి నెలలో రూ.3,973 కోట్ల విలువైన స్టాక్స్‌ను కొనుగోలు చేశారు. కానీ, జనవరి నెలలో రూ.78 వేల కోట్లు, ఫిబ్రవరి నెలలో రూ.34,574 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.



## ఎన్టీపీసీ రూ.33.50 డివిడెండ్

న్యూఢిల్లీ, మే 24: ప్రభుత్వరంగ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్టీపీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.7,897.14 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.6,490.05 కోట్ల లాభంతో పోలిస్తే భారీగా వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.48,816.55 కోట్ల నుంచి రూ.51,085 కోట్లకు ఎగబాకింది. దీంట్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా సంస్థకు రూ.49,352 కోట్ల ఆదాయం సమకూరింది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.1,90,862.45 కోట్ల ఆదాయంపై రూ.23,953.15 కోట్ల నికర లాభాన్ని గడించింది. మరోవైపు, 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.33.50 తుది డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది. గతేడాది కొత్తగా 3,972మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అందుబాటులోకి రావడంతో మొత్తం కెపాసిటీ 79,930 మెగావాట్లకు చేరుకున్నది.



పిప్రిలో యువతకు స్పోర్ట్స్ కిట్స్ అందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

# మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం

**ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్**

నార్నూర్, మే 24 : యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గాదిగూడ మండలంలోని పిప్రి, కుండి షేక్‌గూడ, పూనగూడ గ్రామా ల్లో ఉట్నూర్ ఏఎస్పీ కాలజ్‌తో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు తొలుత సరదాగా ఉంటాయని, మెల్లిగా దానికి బానిసలై పోతారన్నారు. మత్తులో ఏం చేస్తున్నామో తెలియని స్థితిలోకి వెళ్లిపోతారన్నారు. యువత స్వయం నియంత్రణ సామర్థ్యాన్ని పెంచుకుని జీవిత లక్ష్యంపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. అనంతరం యువతకు స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. ఈ కార్య క్రమంలో నార్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రహీంపాషా, గాదిగూడ ఎస్ఐ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

# యువ వికాసానికి 'సిబిల్' గుబులు

భైంసా, మే 24 : చిరు వ్యాపారాలు చేసుకొని జీవితంలో స్థిరపడాలనుకున్న అనేక మంది నిరుద్యోగులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో చాలా మంది జీరో అకౌంట్ తీసుకోవడంతో పెద్దగా లావాదేవీలు జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్‌తో లింకు పెట్టడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొంది. తమ ఖాతా నుంచి ఆర్థిక లావాదేవీలు జరగకపోవడంతో సిబిల్ ఎలా ఉంటుందని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. చాలా మంది ఈ పథకం కోసమే కొత్తగా బ్యాంకు ఖాతాలు తీసుకున్నారు. ప్రభుత్వం ప్రస్తుత చర్యలతో ఈ పథకంపై ఆశలు వదులుకోవాల్సి వస్తున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 50 నుంచి 60 శాతం మంది సిబిల్ లేక ఈ పథకానికి అనర్హులవుతారని అధికారులు తెలిపారు.

**బ్యాంకులకు దరఖాస్తులు**

సిబిల్ చెక్ చేసేందుకు భైంసా పరిధిలో 2,580 దరఖాస్తులను అధికారులు బ్యాంకులకు పంపించారు. ఇది బ్యాంకర్లకు తలనొప్పిగా మారడంతో పాటు ఖాతాదారుడికి రూ. 250 వరకు చార్జి పడుతున్నది. చాలా మంది ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో బ్యాంకర్లు చెక్ చేయకుండా వదిలేస్తున్నారు. ఈ ప్రక్రియ కొనసాగుతుండగా ఇంకా కొన్ని దరఖాస్తులు పాన్‌కార్డు, ఆధార్‌కార్డు సమర్పించాలని దరఖాస్తుదారులకు ఆర్పీలు ఫోన్లు చేసి ఆదేశిస్తున్నారు. పలువురు బ్యాంకు లింకేజీ లేకుండా రూ. 50 వేల లోన్ కోసం దరఖాస్తు చేసుకోగా మిగిలిన వారు రూ. 4 లక్షల వరకు కావాలంటూ దరఖాస్తు పెట్టుకున్నారు. అయితే లబ్ధిదారులను ఏ పద్ధతిలో ఎంపిక చేస్తారనే దానిపై అధికారులు సమాధానం చెప్పడం లేదు. సిబిల్ స్కోర్ జాబితా వచ్చాకే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని చెబుతున్నారు.

# రిమ్స్ ఏడీగా వేణుగోపాల్ రెడ్డి

ఎదులాపురం, మే 24: ఆదిలాబాద్ రిమ్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా వేణుగోపాల్ రెడ్డి నియమితులయ్యారు. శనివారం ఆయన రిమ్స్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నిర్మల్ జిల్లాలో ఏవో పని చేస్తున్న వేణుగోపాల్ రెడ్డిని రిమ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఉద్యోగోన్నతి కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు అశోక్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శాఖల మధ్య సమన్వయంతో పనుల వేగాన్ని పెంచాలి

ఎదులాపురం, మే 24: శాఖల మధ్య సమన్వయంతో పనుల వేగాన్ని పెంచాలని మంత్రులు సీతక్క, కొండా సురేఖ అన్నారు. అటవీ సమస్యలు, పర్యావరణం, అడవులు, శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం విభాగానికి సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో పంచాయతీ, ఆర్అండ్‌బీ, మౌలిక వసతుల కల్పన సంబంధిత పనులకు అటవీ శాఖ అనుమతులకు ఏర్పడిన ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ విషయమై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ఆదిలాబాద్ జిల్లాలోని ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఆర్ అండ్ బీ అధికారులు, అండ్ పంచాయతీరాజ్ అధికారులతో అటవీ సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ అటవీ అనుమతులు రాకపోవడం వల్ల అభివృద్ధి పనులు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. అధికారుల నివేదికలు, ప్రజాప్రతినిధుల సూచనలు పరిగణనలోకి తీసుకున్న మంత్రులు, సమస్యను త్వరగా పరిష్కరించి అభివృద్ధి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వీసీలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ అహ్మద్ న దీమ్, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, రెండు ఉమ్మడి జి ల్లాల పరిధిలోని కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీసీఎఫ్, డీఎఫ్‌వో, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

నిర్మల్ అర్బన్, మే 24 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ శాఖల మౌలిక సదుపాయాల పనులకు అటవీ శాఖ అనుమతులు జాప్యం తలెత్తుతుండడంతో శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్‌తో పాటు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, సీసీఎఫ్‌లు, డీఎఫ్‌వోలు, ఐటీడీఏ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్, జాదవ్ అనిల్, ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడారు. అటవీ అనుమతులు ఆలస్యం కావడం వల్ల అభివృద్ధి పనులు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. అధికారుల నివేదికలు ప్రజా ప్రతినిదుల సూచనలు పరిగణలోకి తీసుకున్న మంత్రులు, సమస్యను త్వరగా పరిష్కరించి అభివృద్ధి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# గ్రామ పాలన అధికారుల రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఎదులాపురం, మే 24 : గ్రామ పాలన అధికారుల నియామకం కోసం ఈనెల 25న (ఆదివారం) జరిగే రాత పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రాత పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై శనివారం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పాలన అధికారుల రాత పరీక్ష కోసం చేపట్టిన చర్యల గురించి ఆయా శాఖలవారీగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. లోటుపాట్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగేలా చూడాలన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 83 మంది అభ్యర్థులు గ్రామ పాలన అధికారుల నియామక రాత పరీక్షకు హాజరు కానున్నారని, వీరికి నలంద డిగ్రీ కళాశాల మావల మండలంలో కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు కొనసాగుతుందని సూచించారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీవో వినోద్ కుమార్ పాల్గొన్నారు.

**నిర్మల్‌లో ఏర్పాట్లు పూర్తి**

నిర్మల్ చైన్‌గేట్, మే 24 : నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న గ్రామ పాలన అధికారుల నియామక పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ తెలిపారు. చాణక్య హైస్కూల్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

## కరోనాకు అందుబాటులో వైద్యం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలి
- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఎదులాపురం, మే 24 : జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో కరోనాకు అవసరమైన వైద్యం అందుబాటులో ఉన్నట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. కరోనా కేసుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైరస్ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పి వంటి సమస్యలు ఉంటే వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. రిమ్స్‌లో వైద్య నిపుణులతోపాటు ఆక్సిజన్ బెడ్‌లు అందుబాటులో ఉండడంతో పాటు, వైద్యానికి అవసరమైన మందులు ఉన్నాయని తెలిపారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలు ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రతను పాటించడంతోపాటు కలుషితమైన నీరు తాగవద్దని, వేడి చేసిన నీటిని తాగాలన్నారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో పలు రకాల కార్పొరేట్ ఆసుపత్రుల మాదిరి వైద్య సేవలు అందిస్తున్నామని వివిధ వ్యాధులకు వైద్యనిపుణులు శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు హైదరాబాద్, నాగ్‌పూర్ వంటి పట్టణాలకు వెళ్లకుండా ఇక్కడే వైద్యం తీసుకోవాలన్నారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో కార్డియాలజిస్టు సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# అందుబాటులో పత్తి విత్తనాల ప్యాకెట్లు

ఎదులాపురం, మే 24: ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 15 లక్షల పత్తి విత్తన పాకెట్లు వివిధ మండలాల్లోని డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని, అలాగే 55వేల ఎంటీఎస్‌ల ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పత్తి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు సూచనలు పాటించాలన్నారు. విత్తనాలు ఎరువులు అధీకృత డీలర్ నుంచి మాత్రమే కొనుగోలు చేయలన్నారు. కొనుగోలు చేసేటప్పుడు రసీదు విధిగా పొందాలని, రసీదును విత్తన ప్యాకెట్‌ను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరు కోవాలన్నారు. గ్రామాల్లో అమ్మే నకిలీ విత్తనాలు, లూజ్ విత్తనాలు ప్రభుత్వం నిషేధించిన బీజీ-3 (కలుపు మందు తట్టుకొనే) విత్తనాలు, మిశ్రమ ఎరువులు, గ్లైఫోసెట్ అను కలుపు నివారణ మందును రైతులు కొనుగోలు చేయకూడదన్నారు. ఎవరైనా డీలర్లు, వ్యక్తులు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించిన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆవులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

- ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎనిమిది చెక్‌పోస్టులు ఏర్పాటు
- డీఎస్పీ జీవన్ రెడ్డి

ఎదులాపురం, మే 24 : బక్రీద్ పర్వదినాన్ని దృష్టిలో పెట్టుకుని ఆవులు, గోసంతని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆదిలాబాద్‌లోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువుల అక్రమ రవాణా నియంత్రణకు జిల్లా పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్, ఉట్నూర్ సబ్ డివిజన్ పరిధిలో మొత్తం ఎనిమిది చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ చెక్‌పోస్టులు అంతర్రాష్ట్ర, అంతర్‌జిల్లా మార్గాల్లో ఏర్పాటు చేయబడినాయని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు భాగంగా వివాదాలు తలెత్తకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించమని తెలిపారు. బక్రీద్ నేపథ్యంలో చట్ట విరుద్ధంగా ఆవులు, దూడలను వధించడం, మత సామరస్యాన్ని భంగపరిచే ప్రవర్తనను ప్రోత్సహించే వారికి చట్టపరంగా కఠినంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇండ్ల మధ్యలో స్లాటింగ్ చేసి ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. వాహనాల్లో పశువుల రవాణా విషయంలో రవాణా గైడ్‌లైన్స్ ప్రకారం నీరు, ఆహారం ఉండేలా చూడాలని సూచించారు. చిన్న వాహనల్లో అధిక పశువులను తరలిస్తే, అది యానిమల్ క్రూయాల్టీ యాక్ట్ ఉల్లంఘనగా పకిగణించబడుతుందని హెచ్చరించారు. ఇటీవల బోథ్ ఘన్‌పూర్ చెక్ పోస్టు వద్ద 37 పశువులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు

## కొనసాగుతున్న వీధి వ్యాపారుల సమ్మె

ఎదులాపురం, మే 24 : ఆదిలాబాద్‌లోని వీధివ్యాపారులకు గణేశ్ థియేటర్ సమీపంలో స్థలాలు కేటాయించినప్పటికీ, ఆ ప్రదేశంలో వ్యాపారం జరగదన్న వాస్తవాన్ని అధికారులు గ్రహించాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ అన్నారు. వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారానిక డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక దీక్షలు శనివారం 4వ రోజుకు చేరుకున్నాయి. అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్, శివాజీ చౌక్ ప్రాంతాల్లో 20 నుంచి 30 సంవత్సరాలుగా వ్యాపారం సాగిస్తున్న తమను నాలుగు రోజుల క్రితం బలవంతంగా తొలగించి, గణేశ్ థియేటర్ ప్రాంతంలో స్థలాలు కేటాయించారని వ్యాపారులు తెలిపారు. కలెక్టర్ కూడా స్వయంగా వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. అక్కడ వ్యాపారం కోసం అనుకూలం కాదని అధికారులు గ్రహించాలని కోరారు. యథావిధిగా వీధి వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, రోహిత్, కాంగ్రెస్ నాయకులు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

## పేటీఎం సేల్స్ ఎగ్జిక్యూట్ ఉద్యోగాలకు జాబ్ మేళా

ఎదులాపురం, మే 24: ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం పేటీఎం సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కే మిల్కా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీన జిల్లా కేంద్రంలోని సాత్నాల క్వార్టర్స్ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పేటీఎం సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లో 50 పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. స్మార్ట్ ఫోన్, ద్విచక్ర వాహనం ఉండాలన్నారు. ఎంపికైన వారు ఆదిలాబాద్‌లో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారికి రూ.15 వేల నుంచి రూ.18 వేలు ఇస్తారన్నారు. ఆసక్తి గల ఆదిలాబాద్ జిల్లా నిరుద్యోగ యవకులు తమ బయోడేటా విద్యార్హత సర్టిఫికెట్‌తో పాటు ఆధార్‌కార్డు, పాన్ కార్డు జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కార్యాలయం జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 7013188805, 9494305417ను సంప్రదించాలని సూచించారు.